# సంచలనం రేపిన భార్య భర్తల హత్యలు

## ఇంద్రేశం లో కలకలం

**పటాన్ చెరు, మార్చి 14, (సిరి న్యూస్):**

పటాన్ చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ లో కలకలం రేగింది. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాచ్ మన్ దంపతులను హత్య చేశారు. దొంగతనాలకు కేరాఫ్ గా మారిన ఈ ప్రాంతంలో బతుకు దెరువు కోసం వలస వచ్చిన బడుగుల ప్రాణాల్ని తీయడం పలు అనుమానాలకు తావిస్తోంది. పటాన్ చెరు మండలం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో భార్యాభర్తల హత్య సంచలనం సృష్టించింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతులు మహబూబబాద్ జిల్లా, గూడూరు మండలం, దొంగ చింత తాండకు చెందిన ధరావత్ సోముల(45), ధరావత్ మంగమ్మ (40) గా పోలీసులు గుర్తించారు. మృతుడు గత మూడున్నర సంవత్సరాలుగా వెంకటేశ్వర రెడ్డి అనే బిల్డర్ దగ్గర పని చేసుకుంటూ జీవిస్తున్నాడు, అతనికి ఇద్దరు



కూతుర్లు, పెద్ద కూతురు పెళ్లి కాగా, చిన్న కూతురు సానియా ఈరోజు శనివారం నాడు పదవ తరగతి పరీక్ష రాస్తోంది. అయితే అమ్మాయి పరీక్ష రాసేంత వరకు ఆమె తల్లిదండ్రుల హత్య సమాచారం ఆమెకు చెప్ప లేరు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు క్ల్యూస్ టీం, డాగ్ స్క్వాడ్ ల సహాయంతో కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. ఇటీవలే మునిసిపాలిటీ గా రూపాంతరం చెందిన ఇంద్రేశం మున్సిపాలిటీ శర వేగంగా అభివృద్ధి చెందుతోంది. అదే సమయంలో, మరో వైపు దొంగతనాలకు అడ్డాగా మారుతున్న ఇంద్రేశంలో వాచ్ మెన్ దంపతుల హత్య సంచలనంగా మారింది. జంట హత్యలకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ సంఘటన తో ఇంద్రేశం లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# మూసీ తరహాలో మంజీరా నదిని కూడా రక్షించాలి

## ప్రత్యేక పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి మెట్టు శ్రీధర్

**పటాన్ చెరు, మార్చి 14, (సిరి న్యూస్):**

మూసి తరహాలో మంజీరా నది ని కూడా పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ అన్నారు. శనివారం నాడు ఇక్కడ ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ లోని మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. అదే స్థాయిలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల జీవనాధారమైన మంజీరా నదిని కూడా కాలుష్యం బారినుండి రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరి ఉప నది అయిన మంజీరా నది ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షలాది మంది ప్రజలకు సాగు, తాగునీటి ప్రధాన ఆధారంగా ఉందని తెలిపారు. భావి తరాలకు సాగు, తాగు



నీటికి ఉపయోగపడే మంజీరా నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి పై ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని నాలాల ద్వారా వచ్చే మురుగు నీరు, పారిశ్రామిక సంస్థలు విడుదల చేసే రసాయన వ్యర్థాలు నక్కవాగు ద్వారా ఇస్మాయిల్ ఖాన్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మంజీరా నదిలో కలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కలుషిత నీరు చివరకు కామారెడ్డి జిల్లా పరిధి లోని నిజాం సాగర్ లోకి చేరుతుందని, ఈ పరిస్థితి కొనసాగితే మంజీరా నది భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంద ని హెచ్చరించారు. హైదరాబాద్ లోని చెరువులు, కుంటలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, హైదరాబాద్‌కు సమీపంలోనే ఉండి వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది ప్రజలకు తాగునీరు అందిస్తున్న మంజీరా నది కాలుష్య సమస్యపై కూడా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా, కాలుష్య ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం గతంలో పటాన్ చెరు లో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రారంభం కాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం భవనాలు నిర్మించడం తోనే సరిపోదని, కాలుష్య బాధితులకు తక్షణమే పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కుతో పాటు స్వచ్ఛమైన పర్యావరణం పొందే హక్కు కూడా ఉందని గుర్తు చేశారు. అలాగే నీటి కాలుష్య నివారణ చట్టం–1974ను కఠినంగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూసీ నది తరహాలోనే మంజీరా నది పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, లేదంటే మరోసారి గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడానికి వెనుకాడనని మెట్టు శ్రీధర్ హెచ్చరించారు. మంజీరా నదిని కాలుష్యం బారినుండి రక్షించుకోవడం ప్రభుత్వంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.

# ఆపత్కాలంలో మేము సైతం

## పౌర రక్షణ వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్న గీతం విద్యార్థులు

**పటాన్ చెరు, మార్చి 14, (సిరి న్యూస్):**

అనుకోని విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రభుత్వ సాయం కోసం వేచి చూడకుండా తక్షణమే తోటి పౌరులకు తగిన సహాయ సహకారాలను అందించే లక్ష్యంతో పౌర రక్షణ వాలంటీర్లుగా గీతం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. తెలంగాణ అగ్నిమాపక విపత్తు స్పందన అత్యవసర, పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల 'పౌర రక్షణ స్వచ్ఛంద శిక్షణ – సామర్థ్య నిర్మాణం' కార్యక్రమాన్ని ఈనెల 10 నుంచి 18 వ తేదీ వరకు హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు. పౌర రక్షణ, విపత్తు నివారణ, అగ్ని ప్రమాదాలపై ప్రాథమిక జ్ఞానం, అగ్నిమాపక చర్యలు, గాలింపు, సహాయక కార్యక్రమాలు, ప్రథమ చికిత్స వంటి కీలక అంశాలపై ఇస్తున్న ఈ శిక్షణలో దాదాపు వంద మంది గీతం విద్యార్థులు పాల్గొంటున్నారు. రక్షణ పరికరాలు, అగ్నిమాపక వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన పద్ధతులు, ఆయా పరికరాల వినియోగంపై విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని కూడా పొందుతున్నారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవంలో సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక అధికారి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ... విపత్తులు, అత్యవసర పరిస్థితులలో అధికారులకు సహాయపడేం దుకు శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకుల బలమైన నెట్ వర్కును నిర్మించడం యొక్క ఆవశ్యకతను వివరిం చారు. అగ్నిప్రమాదాలు, దుర్ఘటలను, అలాగే సహజ లేదా మానవ కల్పిత విపత్తుల వంటి అత్యవసర పరిస్థితులలో సంబంధిత శాఖలకు సహాయ పడేందుకు విద్యార్థులకు అత్యంత కీలకమైన నైపుణ్యా లను ఈ శిక్షణలో నేర్పిస్తున్నట్టు పటాన్ చెరు అగ్నిమాపక శాఖాధికారి కె.వి. నాగేంద్ర పేర్కొన్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), పోలీసు, అగ్నిమాపక సేవల వంటి సంస్థలతో సమన్వయం చేసుకోవడం, సంక్షోభాల సమయంలో వ్యవస్థీకృత, ప్రభావవంతమైన ప్రతిస్పందన కోసం ఈ శిక్షణ ఉపకరిస్తుందని వారు తెలియజేశారు. విపత్తు నిర్వహణలో సమాజ సంసిద్ధతను బలపేతం చేయడానికి, స్వచ్ఛంద సేవను ప్రోత్సహించడానికి దీనిని నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు. అరుదుగా లభించే ఇటువంటి శిక్షణ కార్యక్రమంలో గీతం విద్యార్థులు కూడా ఎంతో ఉత్సుకతతో పాల్గొంటున్నారు.






# ప్రపంచ గ్లూకోమా దినోత్సవం" సందర్భంగా అవగాహన ర్యాలీ..

**కొంపల్లి,మార్చి-15(సిరి న్యూస్).**

సర్వేంద్రియానం ప్రధానం అన్నాడో కవి.... కంటిలో వచ్చే గ్లూకోమా వ్యాధిని అతి త్వరలో పసిగట్టి కళ్ళను కాపాడుకోవాలని సోలీస్ ఐ కేర్ డైరెక్టర్ మహేష్ పేర్కొన్నారు.శనివారం "ప్రపంచ గ్లూకోమా దినోత్సవం" సందర్భంగా గ్లకోమా అవగాహన వాక్ కార్యక్రమాన్ని శనివారం నాడు కొంపల్లి,దూలపల్లి,జయభేరి కాలనీ పరిసర ప్రాంతాలలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ కంటిలో వచ్చే గ్లూకోమా వ్యాధి చాలా ప్రమాదకరమైందని వీలైనంత త్వరలో ఆ వ్యాధిని పసిగట్టి నయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. లేదంటే ఆ వ్యాధి ముదిరితే కంటి చూపు పోయే ప్రమాదం ఉందని అన్నారు.హాస్పిటల్ జి ఎం




అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ గ్లకోమా వ్యాధి వలన శాశ్వత అంధత్వానికి గురవుతారని కళ్ళు లేనిదే ఈ ప్రపంచ సృష్టిని చూడలేమని ఆయన అన్నారు.కంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.40 సంవత్సరాలు పైబడిన వారు అందరూ తప్పకుండా ఈ గ్లూకోమా పరీక్షను చేయించుకోవాలి అన్నారు.ముఖ్యంగా బి.పి, షుగరు ఉన్న వాళ్ళ లో ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుం దన్నారు. సకాలంలో ఈ వ్యాధిని గుర్తించలేకపోతే శాశ్వత అంధత్వానికి దారి తీస్తుందన్నారు. ఈ గ్లకోమా వ్యాధి నిర్ధారణ కోసం అన్ని సోలీసు ఆసుపత్రుల లో ఆధునిక పరికరాలతో, ప్రత్యేక కంటి డాక్టర్లు అందుబాటులో ఉన్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్లూకోమా స్పెషలిస్ట్ డాక్టర్ అశోక్,డాక్టర్ అక్షిత రెడ్డి, విజయేంద్ర రెడ్డి, విజయ లక్ష్మీ, భాస్కర్, సుబ్బారావు మరియు ఆసుపత్రి సిబ్బంది తో పాటు పలువురు ప్రతినిధులు మహదేవ్ ట్రస్టు రాకేష్ మరియు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**తూప్రాన్ మార్చి14 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు ఇస్లాంపూర్ సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ యాదయ్య ఇస్లాంపూర్ గ్రామ నర్సరీని పరిశీలించారు ఎండాకాలం రాబోతున్న తరుణంలో మొక్కలకు నీరు మంచిగా అందించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు అదేవిధంగా గ్రామంలోని పరిశుద్ధ కార్యక్రమాన్ని సందర్శించి సుచి శుభ్రతుల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు ఇస్లాంపూర్ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి వాటర్ ట్యాంక్ సమస్యలపై అధికారికి వివరించారు గ్రామం కోసం గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కాకుండా చిన్నపాటి అవసరాలకు తన సొంత నిధులు ఇవ్వడానికి వెనకాడబోనని ఈ సందర్భంగా తెలిపారు కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కల్పన ఉప సర్పంచ్ విజయ నవీన్ వార్డు సభ్యులు నాగరాణి జవాన్ల రాజు మల్లేష్ జయరాం జీవన్ రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కావాలనే జి.ఐ వైర్ కు కరెంట్.. వ్యక్తి మృతి ఘటనలో అరెస్ట్

**నార్సింగి, మార్చి 14 (సిరి న్యూస్) :**



పాత కక్షలతో జి.ఐ వైర్ కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, విషయం తెలియక బట్టలు ఆరబెట్టే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ విషయాన్ని రామాయంపేట సీఐ వెంకటరాజు గౌడ్ తెలిపారు. శనివారం నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ బీమరి సృజన, సిబ్బందితో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మేడ్చల్ మండలం అత్వెల్లి గ్రామానికి చెందిన దండ శ్యాంసుందర్ తన కుటుంబంతో కలిసి నార్సింగి పట్టణంలోని తన భార్య తరపు బంధువుల ఇంటికి పెళ్లి కార్యక్రమానికి వచ్చాడు. అయితే, శ్యాంసుందర్ బంధువులు అయిన నాగరాణి, పక్కింట్లో నివసించే తమ్మారెడ్డి భూపాల్ రెడ్డి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూపాల్ రెడ్డి తన ఇంటి గోడకు ఉన్న జి.ఐ వైర్ కు ప్రమాదమని తెలిసినా విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ నెల 8 వ తేదీ ఆదివారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో శ్యాంసుందర్ అదే వైర్ పై బట్టలు ఆరబెట్టే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. భూపాల్ రెడ్డి పాత కక్షల నేపథ్యంలో కావాలనే వైర్ కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ప్రాణాలు తీసేలా చేశాడని మృతుడి భార్య భార్గవి, ఇంటి యజమాని నాగరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఘటన అనంతరం పరారీలో ఉన్న తమ్మారెడ్డి భూపాల్ రెడ్డి ని శనివారం అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడని సీఐ పేర్కొన్నారు. నిందితుడిపై సెక్షన్ 103(1) ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

# నార్సింగి లో పదో తరగతి పరీక్షలకు వంద శాతం హాజరు




**నార్సింగి, మార్చి 14 (సిరి న్యూస్) :**

మండల కేంద్రంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు తొలి రోజు శనివారం వంద శాతం హాజరు తో ప్రశాంతంగా జరిగాయి. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరగనున్న పరీక్షల కు మండల వ్యాప్తంగా ఒకటే పరీక్షా కేంద్రాన్ని మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ డీ.వీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ బీమరి సృజన పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతంలో బీ.ఎన్.ఎస్.ఎస్ 163 (పాత 144 సీ.ఆర్.పీ.సీ) సెక్షన్ ను అమలు పరుస్తూ తన సిబ్బంది తో పటిష్ట బందోబస్తు ను ఏర్పాటు చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశాంతంగా, ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా ఆత్మవిశ్వాసం తో పరీక్షలు రాసి మంచి మార్కుల తో ఉత్తీర్ణత సాధించి బంగారు జీవితం కోసం బాటలు వేసుకోవాలని సూచించారు. శనివారం జరిగిన మొదటి పరీక్షకు నార్సింగి ఉన్నత పాఠశాల కు చెందిన 128, శేరిపల్లి పాఠశాల నుంచి 9 మొత్తం 137 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారని చీఫ్ సూపరిండెంట్ పద్మజా తెలిపారు. పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చీఫ్ సూపరిండెంట్ పద్మజా కోరారు.

